అజోల్లాతో అన్నదాతకు ఆదాయం

- పశుగ్రాస ఉత్పత్తికి ప్రత్యేక విధానం
- ప్రకృతి వ్యవసాయం ద్వారా పెంపకం
- పాడి రైతులకు ప్రత్యేక శిక్షణ
- తక్కువ ఖర్చుతో మేలైన పోషకాలు లభ్యం



దుర్గాడలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఇంటి డాబాపై అజోల్లా పెంపకం

పిఠాపురం: పాడి, పంట అన్నదాతకు రెండు కళ్ల లాంటివి. ఈ రెండూ బాగుంటేనే రైతు బాగుంటాడు. తద్వారా సమాజం బాగుంటుంది. గతంలో పాడి, పంటకు అవినాభావ సంబంధం ఉండేది కాని నేడు రసాయనిక ఎరువులు, పురుగు మందులు రాజ్యమేలుతుండడంతో పాడిపై రసాయనాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈనేపథ్యంలో పశువులకు ఆరోగ్యవంతమైన మేత దొరకడం కష్టంగా మారింది. పశువు ఆరోగ్యంగా ఉండాలన్నా, పాల దిగుబడి ఆశాజనకంగా ఉండాలన్నా పశు మేత పైనే ఆధారపడి ఉంటుంది. అలాంటి మేతపై శ్రద్ధ చూపకపోతే పాడి పరిశ్రమ దెబ్బతింటుంది. వ్యవసాయ వ్యాపారంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో పచ్చి మేతల కొరత ప్రధాన సమస్యగా మారింది. మేతలపై ఖర్చు తగ్గించుకునేందుకు పోషక విలువలను పెంచేందుకు అజోల్లా మేత అందుబాటులోకి రావడంతో రైతులు ప్రకృతి వ్యవసాయంలో దీని పెంపకం చేపట్టారు. ఈ మేత ఒక్క పశువులకే కాదు కోళ్లు, కుందేళ్లు, చేపలు తదితరాకు అత్యధిక పోషక విలువలు ఉన్న మేతగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయంలో అజోల్లా పెంపకాన్ని పలువురు రైతులు చేపట్టారు. ఆసక్తి ఉన్న ప్రకృతి వ్యవసాయ రైతులు తమ ఇళ్ల మేడలపై అజోల్లా పెంపకాన్ని చేపట్టి తయారైన అజోల్లాను వరి పైరుతో పాటు ఇతర పంటలలో వేసి పశువులకు బలవర్ధకమైన మేతగా ఉపయోగిస్తున్నారు.

మేత ఖర్చు తగ్గించేందుకే..

పశు పోషణలో మేత ఖర్చు సుమారు 70 శాతం ఉంటుంది. మేత ఖర్చు తగ్గాలంటే చౌకగా లభించే పశు గ్రాసాలను వాడడం ద్వారా చాలా వరకు ఖర్చు తగ్గించుకోవచ్చు. మంచి పోషక విలువలు ఉన్న మేతను ఎంచుకోవడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు పాల ఉత్పత్తి పెరిగి పశు పోషణ లాభదాయకంగా ఉంటుంది. అలాంటి మేతగా పరిశోధకులు తేల్చి చెప్పిన అజోల్లా పట్ల రైతులకు పశు వైద్యాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

తయారీ విధానం..

ముందుగా నీరు నిలవని ఎత్తయిన చోటును ఎంచుకోవాలి. 2.5 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 20 సెంటీ మీటర్ల లోతు ఉండే విధంగా గుంతలు తీసుకోవాలి. దానిలో పాలిథిన్ పట్టాను వేసుకుని నీరు ఇంకి పోకుండా ఏర్పాటు చేసుకోవాలి. దానిలో సారవంతమైన మట్టిని (30 నుంచి 35 కిలోలు) చల్లుకోవాలి. 15 నుంచి 20 లీటర్ల నీటికి 2 నుంచి 5 కిలోల పేడను కలిపి చిక్కగా పేస్టులా తయారు చేసుకోవాలి. దానికి 40 గ్రాముల సూపర్ ఫాస్పేట్ కలిపి గుంత అంతా పరచుకోవాలి. ఆ గుంతలో 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకు నీటిని పెట్టి దానిలో అజోల్లా విత్తనాన్ని చల్లుకోవాలి. దానిపై నీటిని చిమ్మితే అజోల్లా మొక్కలు నీటిలో నిటారుగా ఎదుగుతాయి. ఒక తొట్టి నిండా తయారైన అజోల్లా ఒక పాడి పశువుకు సరిపోతుంది. రైతు తనకున్న పశువులను బట్టి తొట్టెలను ఏర్పాటు చేసుకోవాలి. అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు మట్టిని, నీటిని మార్చుకోవాల్సి ఉంటుంది. వారానికి ఒక సారి 500 గ్రాముల ఆవు పేడకు 20 గ్రాముల సూపర్ ఫాస్పేట్ మినరల్ 5 లీటర్ల నీటికి కలిపి వేసుకోవడం వల్ల అజోల్లా ఏపుగా పెరుగుతుంది. ఈ తొట్టెలపై ఎండ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తగిన పైకప్పు ఏర్పాటు చేసుకోవాలి. ఒక గుంతకు రూ.1800లు నుంచి రూ.2 వేలు ఖర్చు అవుతుంది. ఒక తొట్టి నుంచి రోజుకు ఒక కిలో అజోల్లా తీసుకోవచ్చు. ఎటువంటి ఖర్చు లేకుండా రెండు నెలల్లో 60 కిలోల అజోల్లా ఉత్పత్తి అవుతుంది.

ఉపయోగాలు ఇలా...

తక్కువ భూమిలో రైతులు తమ ఇళ్ల వద్దే దీని పెంపకం చేపట్టవచ్చు. ఇది నీటిలో తేలియాడే ఫెర్న్ జాతికి చెందిన మొక్క. దీనిని అజోల్లా ఫెర్నిట అంటారు. దీనిని మేతగా దానాలో కలుపుకుని పెట్టినట్టయితే పాల ఉత్పత్తి 15 నుంచి 20 శాతం, పాలల్లో వెన్న శాతం పెరుగుతుంది. తద్వారా మార్కెట్‌లో మంచి రేటు పలికి రైతుకు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. దీనిలో మాంసకృత్తులు 25 నుంచి 30 శాతం, పీచు పదార్థం 12 నుంచి 15 శాతం, కాల్షియం, కెరోటిన్, విటమిన్లు, ఫాస్పరస్ అధికంగా ఉండి పశువుకు మంచి ఆరోగ్యాన్నిచ్చి పాల ఉత్పత్తి పెరగడానికి దోహద పడుతుంది. ఒక పాడి పశువుకు రోజుకు 1 నుంచి 15 కిలోల అజోల్లా మేపుకోవచ్చు.

తక్కువ ఖర్చుతో ఆదాయం..



అజోల్లా మేత తయారు చేసుకోవడం ద్వారా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో ప్రోత్సాహాన్నిస్తోంది. దీనిలో భాగంగా అజోల్లా పెంపకంపై గతంలో శిక్షణ ఇచ్చాం. పశు వైద్య సిబ్బంది పాడి ఉన్న ప్రతి రైతుకు అజోల్లా తయారీపై అవగాహన కల్పించారు. పశువులను కట్టుకునే గోశాల వద్దే వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. దీని ద్వారా దాణా ఖర్చు చాలా తగ్గుతుంది. పాల ఉత్పత్తి పెరిగి నెలకు సుమారు రూ.10 వేల వరకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. అజోల్లా మేత వల్ల పశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పలు వ్యాధుల బారి నుంచి పశువులను కాపాడుకోవచ్చు.

– డాక్టర్ హిమజ, పశువైద్యాధికారిణి, గొల్లప్రోలు

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ మెంబర్‌గా అక్షయ్

కొత్తపల్లి: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి కమిటీ మెంబర్‌గా మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన రావు సత్య గోపాల్ అక్షయ్‌ను నియమిస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్. లావణ్య కుమారి నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. తనను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా నియమించినందుకు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మెంబర్‌గా నియమితులైన అక్షయ్‌ను పలు పార్టీల నాయకులు అభినందించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



వెంకటేష్

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిలువ చేసిన, తయారు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణాసంచా తయారు చేసేవారు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నివాస గృహాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు పెట్టరాదన్నారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమతులు తప్పని సరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

కల్వర్టు పనుల పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

సామర్లకోట: స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో శిథిలమైన కల్వర్టు పనులను వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ కల్వర్టు శిథిలం కావడంతో కల్వర్టు మీదుగా రాక పోకలు సాగించే వారు నిత్యం ప్రమాదాలకు గురి అవుతూ ఉండేవారు. సామర్లకోట స్టేషన్ సెంటర్ నుంచి పోలీసు స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జగనన్న కాలనీ, కిర్లంపూడి వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. ఈ మార్గంలో కల్వర్టు సుమారు రెండు నెలల క్రితం శిథిలం అయింది. ఈ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు కౌన్సిల్ సమావేశంలో ఈ కల్వర్టు ప్రాధాన్యతను తెలియజేయడంతో నిధులు మంజూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించే విధంగా చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ ఏ. శ్రీవిద్యలు చర్యలు తీసుకున్నారు.

కొండెవరంలో అన్న సమారాధన

కొత్తపల్లి: కొండెవరంలో దుర్గాదేవి ఆలయం వద్ద శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెళ్లి విందును తలపించే విధంగా పలు రకాల పిండి వంటలతో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండెవరం గ్రామం నుంచే కాక నవకంద్రవాడ, ఇసుకపల్లి, శొంఠివారిపాకలు తదితర గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కెనాల్ రోడ్డులో ట్రాక్టరు బోల్తా



కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టరు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో శుక్రవారం లోడుతో వెళుతున్న ట్రాక్టరు తొట్టి బోల్తా పడింది. వేట్లపాలెం నుంచి తవుడు లోడుతో కాకినాడ వెళుతున్న ట్రాక్టరు ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో మాండవ్య నారాయణ స్వామి బ్రిడ్జి రోడ్డులో బోల్తా పడింది. ట్రాక్టరు డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించి కిందికి దూకేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పొడవునా ఉన్న రోడ్డులో వర్షపు నీరు పోయే మార్గం లేక పోవడంతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పెద్ద పెద్ద గోతులతో నిండిపోయింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డిబేట్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు డిబేట్‌లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ శుక్రవారం సాయంత్రం తెలిపారు. కాకినాడ ఏపీఎస్‌పీ జెడ్పీ హైస్కూల్‌లో ఏఎంఓ ఎం రామారెడ్డి ఆధ్వర్యంలో వ్యాస రచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు జరిగాయని తెలిపారు. 'వన్ ఇండియా వన్ నేషన్' అనే అంశంపై నిర్వహించిన డిబేట్‌లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వీవీడీ చాందిని, టి హరిణి సాయిలక్ష్మి ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. విద్యార్థులను కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కెవీవీ సత్యనారాయణ, ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య, హెచ్ఎం సాయిరామకృష్ణలు అభినందించారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మూలపేట ప్రకాష్ నగర్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన నంది విగ్రహం వద్ద అదే గ్రామానికి చెందిన ఆవాల మణికంఠ ఈ నెల 16న రాత్రి పెద్దలతో తగాదాకు దిగాడు. అక్కడి నుంచి వెళ్లిన తర్వాత తిరిగి తన తండ్రితో వచ్చి అక్కడే ఉన్న మేడిబోయిన తాతీలను తన వెంట తెచ్చుకున్న చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై తాతీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించి ముద్దాయిని శుక్రవారం తన ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. ముద్దాయిని పిఠాపురం కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఎం ధర్నా



ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విధించిన ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలపై అన్యాయంగా మోపిన విద్యుత్తు భారాన్ని రద్దు చేస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తూ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. సగటు మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిన తరుణంలో కొత్తగా రూ. 8,144 కోట్లు విద్యుత్తు భారాలు మోపి ప్రజలను మరింత కష్టాలోనికి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరణం గోవిందరాజు, విపర్తి కొండలరావు, బాలం శ్రీనివాసు, హరి బాబు, సురేష్, వీరబాబు, పవన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు దుర్మార్గం

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే విద్యుత్ ఛార్జీలు పెంచడం చాలా అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అన్నారు. స్థానిక పట్టణ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం నాయకులు విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నీలపాల సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు విద్యుత్ ఛార్జీల పెంపు ఉండదని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో తూతూ మంత్రంగా బహిరంగ విచారణ జరిపి ప్రజలపై భారాన్ని వేయడానికి సిద్ధ పడడం అన్యాయమన్నారు. ట్రూఅప్ ఛార్జీలు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జేఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు మరిడయ్య, డి.సత్యన్నారాయణ, డి.కృష్ణ, కూనిరెడ్డి అప్పన్న, రొంగల వీర్రాజు, చల్లా విశ్వనాథం, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏంజెట్ల ఆందోళన



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

పెద్దాపురం: ఎల్ఐసీ పాలసీల్లో ఏజెంట్ల కమీషన్ల కోతకు నిరసనగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద శుక్రవారం కార్యాలయ పరిధిలోని ఎల్ఐసీ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎల్ఐసీ ఏజెంట్ల అధ్యక్షుడు అప్పాన నాగేశ్వరరావు, సెక్రటరీ గొండేల జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శి వాసంశెట్టి గంగ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు ప్రీమియం రెండు లక్షలు పెంచడం వల్ల సన్న, చిన్న కారు రైతులు ప్రీమియం కట్టలేని దుస్థితి నెలకొంటుందని అన్నారు. ఏజెంట్ల కమీషన్‌లో కోత దారుణమని సత్వరమే వాటి నిర్ణయాలను విరమించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ శాస్త్రి, గారీపతిరావు, గోరింట అబ్బులు, పడాల దుర్గా ప్రసాద్, కుసుమంచి కృష్ణంరాజు, బోయిన వెంకట రమణ, పీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును బాధ్యతగా నిర్వర్తించాలి



శిక్షణకు హాజరైన ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది

సామర్లకోట: ధాన్యం కొనుగోలులో ఎవరికి కేటాయించిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి సిబ్బందికి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లోడు ఏ మిల్లుకు కేటాయించడం జరిగిందో అదే మిల్లుకు సకాలంలో చేరే విధంగా చూడ వలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. తేమ శాతం నుంచి, రాళ్లు, ధాన్యం నాణ్యతను రైతు భరోసా కేంద్రాలల్లో పరిశీలించడం జరుగుతుందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ఆరబెట్టు కోవాలని రైతులకు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రంలో నిర్ణయించిన తేమ శాతమే కీలకమని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా తేమ శాతాన్ని గుర్తించాలన్నారు. ధాన్యం లోడ్ వాహనాలకు జీయో ట్యాకింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. దీనివల్ల వాహనం ఎక్కడ ఉందో స్పష్టంగా తెలుసుకోడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి ఐ సత్యలు వీఆర్వోలు, వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్సు



ఉద్యోగుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న బృంద సభ్యులు

సామర్లకోట: రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి 'స్నేహ హస్తం' పేరుతో గ్రీవెన్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ తెలిపారు. స్థానిక రైల్వే కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ సీనియర్ డివిజినల్ పర్సనల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు 'స్నేహ హస్తం' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, తుని, బిక్కవోలు రైల్వే స్టేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల నుంచి గ్రీవెన్సు ద్వారా అర్జీలు స్వీకరించి వాటిని డీపీఓకు ఆన్‌లైన్‌లో పంపిస్తామన్నారు. సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీఓ ఎం అనిరుధ్ ఆధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరించారు. కార్మికులు సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న కారణంగా సామర్లకోట రైల్వే జంక్షన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రైల్వే ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై 207 ఫిర్యాదులు అందాయని పర్సనల్ డిపార్టుమెంట్ బృందం ప్రతినిధులు టి సాంబశివరావు, ఆర్ వరహాలబాబు, కె. దీన్‌దయాల్, కె శేషగిరిరావు, జి. ప్రభుకుమార్, ఎస్ చరణ్, బి సతీష్‌గిరి, జి. ప్రేమకుమార్, కె ఫణీంద్రనాథ్ తెలిపారు.

పైపులైన్లకు మరమ్మతులు చేపట్టరూ..!

కొత్తపల్లి: ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో తాగు నీటి ప్రధాన పైపులైను వాకతిప్ప కాపురం రామలయం వద్ద మరమ్మతులకు గురయింది. నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకం పైపులైన్లు మరమ్మతులకు గురి కావడంతో గత కొంతకాలంగా తాగునీరు వృథాగా పోతోంది. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు తమ కేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీరు వృథా చేయరాదని చెప్పే అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ప్రధాన పైపులైను నుంచి వృథాగా పోతున్న తాగునీరు

మరిడమ్మకు విశేష పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రీతికరమైన రోజు కావడంతో బంగారు, వెండి పుష్పాలు, పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొమ్మల కల్యాణం చూతము రారండి...!



పిఠాపురంలో జరిగిన బొమ్మల పెళ్లి

పిఠాపురం: పిఠాపురం శిష్టికరణాల వీధిలో బాజా భజంత్రీలు మారు మోగుతుండగా ముత్తయిదువులు సంప్రదాయ పద్ధతిలో నూతన వధూవరులను తీసుకువచ్చి కన్నుల పండువగా నిర్వహించిన కల్యాణం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఊరంతా కలిసి వచ్చి పెళ్లి చేసింది మనుషులకు మాత్రం కాదు..ఈ పెళ్లి చేసింది బొమ్మలకంటే ఆశ్చర్యం కలగల మానదు. నిజం పెళ్లిని మరపిస్తూ ఆద్యంతం అన్ని రకాల తంతులతో శుక్రవారం జరిపించిన బొమ్మల పెళ్లి సంప్రదాయాలకు అద్దం పట్టింది. పిఠాపురం శిష్టి కరణాల వీధిలో కొలువైన పురూహూతికా అమ్మవారి ఉత్సవాలలో భాగంగా సంప్రదాయంగా కొనసాగుతున్న బొమ్మల పెళ్లిని ఈ ఏడాది కూడా జరిపించారు. ఏలూరి సూర్యనారాయణ, నాగరత్నం దంపతులు చేతుల మీదుగా జరిపించిన ఈ పెళ్లిలో పెళ్లి కుమార్తెను నార్ల మహంతి సుబ్బలక్ష్మి, సూరిబాబు దంపతులు, పెళ్లి కుమారుడిని పడాల వారి ఇంటి నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి పెళ్లి జరిపించారు. పలువురు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కనుమరుగవుతున్న సంప్రదాయాలకు ఊపిరి పోయాలనే ఉద్దేశ్యంతో ఎన్నో ఏళ్ల నుంచి సంప్రదాయంగా వస్తున్న బొమ్మల పెళ్లిని జరిపిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.